


ఫారంపాండ్‌పై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - పల్లూరు

గ్రామాలలో ఫారం పాండ్(నీటి కుంటల) పనులపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పథక సంచాలకులు ఆదిశేష రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గోటూరు గ్రామానికి చెందిన గంగాధర్ పొలంలో ఉపాధి హామీ పథకం తరఫున చేసిన ఫారం పాండ్‌ను సందర్శించారు. మండలంలో మొత్తం ఈనెల ఆఖరికి 82 ఫారం పాండ్‌లు నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 28 పూర్తి చేశారని తెలిపారు. ఉపాధి సిబ్బంది ఈనెల ఆఖరికి తప్పనిసరిగా ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ సుధారాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిని చిదిమేసిన మృగం



అయ్యో పాపం ఆమె చిట్టి చేతులు ఇంకా బొమ్మలతో ఆడుకోవాల్సింది. తన అందమైన చూపులతో బంగారు భవితను చూడాల్సింది. అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన చిట్టితల్లి..అప్పటిదాకా..నవ్వుల పువ్వులు విరబూయించిన పాపాయి. కామాంధుడి కబంధ హస్తాల్లో చిక్కి విలవిల్లాడింది. అరటి పండు ఆశచూపిన దుర్మార్గుడి దుష్ట చర్యలకు బలైంది. రాక్షసుడి క్రూరత్వం..మానవత్వానికి మాయని మచ్చయింది. అభం శుభం తెలియని పసికందు మరణం ప్రతి హృదిని ద్రవింపజేసింది.

- నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం..ఆపై హత్య
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఎన్‌కౌంటర్ చేయాలని బాధితుల డిమాండ్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

అభం శుభం తెలియని చిన్నారి...అమ్మ, నాన్నలతో కలిసి పెళ్లికి వచ్చి మానవ మృగం చేతిలో నలిగి చనిపోయిన సంఘటన కడప జిల్లా జమ్మలమడుగు నియోకవర్గం, మైలవరం మండలం ఎ.కంబాలదిన్నే గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే.. శుక్రవారం కడప జిల్లా ప్రొద్దుటూరులోని అమృతనగర్‌కు చెందిన దంపతులు వారి నాలుగేళ్ల కుమార్తెను వెంటబెట్టుకొని బంధువుల పెళ్లి నిమిత్తం మైలవరం మండలం కంబాలదిన్నేకు వెళ్లారు. చిన్నారి పెళ్లి మండపం బయట ఆడుకుంటున్న సమయంలో మోరగుడికి చెందిన తలారి రహమతుల్లా అలియాస్ కబీర్ అరటి పండు ఇస్తానని ఆశ చూపించి ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. విషయం బయటపడుతుందని చిన్నారిని హత్య చేశాడు. చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సమీపంలో గాలించారు. ముళ్ల పొదల్లో చిన్నారి మృత దేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం తెలుసుకున్న మైలవరం మండలం తలమంచి పట్నంకు చెందిన పోలీసులు హుటాహుటిన వెళ్లి సంఘటన స్థలానికి చేరుకొని ఆరా తీశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి మృతదేహాన్ని సజమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు తల్లిదండ్రులు ఇచ్చిన వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నిందితుడు రహమతుల్లా (ఫైల్)

నిందుతుడిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

మైలవరం మండలంలోని ఎ.కంబాలదిన్నె గ్రామంలో చోటు చేసుకున్న దుర్ఘటన చాలా బాధకరమైందని సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు ఎ.వినయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని శిక్షించాలని పేర్కొన్నారు. ఈ ఘటనపై హోం శాఖ మంత్రి స్పందించి ఆ చిన్నారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షంచాలని ఎస్ఎఫ్ఐ, సిఐటియు నాయకులు నరేంద్ర, మధు డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలకు పరిష్కారం చూపుదాం

- విస్తరణ అంతరాలను తగ్గించే దిశగా పరిశోధనలు
- పెట్టుబడుల తగ్గింపుపై రైతులు దృష్టి పెట్టాలి
- ఉత్పత్తుల నాణ్యత పెరిగితే ఎగుమతులకు అవకాశం
- విలువ ఆధారిత ఉత్పత్తి లాభదాయకం
- పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో శాస్త్రవేత్తలు, అధికారులు



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం దిశగా పనిచేయాలని అధికారులు, శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పరిశోధన, విస్తరణ అంతరాలను తొలగింపు దిశగా పరిశోధనలు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా రైతుల ఆదాయం పెంచడానికి వీలు అవుతుందని అభిప్రాయ పడ్డారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో శుక్రవారం రాయలసీమ జోన్ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు చెందిన ఉద్యాన శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులు, సూక్ష్మనీటి పథకం (ఎపిఎంఐపి) అధికారులు హాజరై రైతులతో చర్చించారు. రైతుల సమస్యలకు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ కె.టి.వెంకట రమణ మాట్లాడుతూ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలు ప్రతి ఏడాది రెండు సార్లు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ మొదటి వారంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి ప్రాంతీయ సదస్సుల ద్వారా వచ్చిన సమస్యలపై చర్చిస్తామన్నారు. ఈ సమావేశం ద్వారా పరిశోధన, విస్తరణ అంతరాలను గుర్తించి వచ్చే ఏడాది చేపట్టాల్సిన పరిశోధన, విస్తరణ కార్యక్రమాల భవిష్యత్ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. రైతులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారం ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పరిష్కారం లేని సమస్య పరిష్కారానికి చేపట్టాల్సిన పరిశోధనలపై కార్యచరణ చేపడతామన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు మాట్లాడుతూ రైతులు తమ ఎదుర్కొంటున్న పంటల సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు. వివిధ పంటల నిపుణులు, సంబంధిత ప్రభుత్వ అధికారులు రైతుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నారన్నారు. రాయలసీమను ఉద్యాన సీమగా రూపొందించడానికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. సహపరిశోధన సంచాలకులు డాక్టర్ సి.మధుమతి మాట్లాడుతూ ఐదేళ్ల తర్వాత పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహిస్తున్నామని, రైతులు తమ సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గత ఏడాది ప్రాంతీయ సలహామండలి సమావేశంలో వివిధ ఉద్యాన పంటలకు సంబంధించి రైతులు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు, వాటికి చేపట్టిన చర్యలను వివరించారు. అన్నమయ్య జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు రవిచంద్రబాబు మాట్లాడుతూ రైతులు పంట పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయని దానికి తగ్గట్టు ఆదాయం రావడంలేదన్నారు. రైతులు పెట్టుబడి తగ్గించుకోవాలని సూచించారు. ఖర్చు పెరగడం తగిన గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారన్నారు. పెట్టుబడి వ్యయం తగ్గించుకొనే దిశగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేపట్టాలని సూచించారు. పంట నాణ్యత పెరిగేలా, ఎగుమతులకు అనుకూలమైన ఉత్పత్తి వచ్చేలా చూడాలని కోరారు. నెల్లూరు జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు సుబ్బారెడ్డి తన ప్రసంగంలో నిమ్మ, మామిడి ఇతర ఉద్యాన పంటలలో వచ్చే తెగుళ్లను ప్రస్తావించారు. తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు దశరథరామిరెడ్డి, సత్యసాయి జిల్లా ఉద్యాన శాఖ సంచాలకులు చంద్రశేఖర్, వైఎస్ఆర్ జిల్లా సంచాలకులు సుభాషిణి, చిత్తూరు జిల్లా సంచాలకులు మధుసూదనరెడ్డి, అనంతపురం జిల్లా సంచాలకులు ఫిరోజ్ ఖాన్, నాగరాజు (నంద్యాల), కడప, నెల్లూరు, అనంతపురం జిల్లాల ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, రఘునాథరెడ్డి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో అనంతరాజుపేట ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.టి.శ్రీనివాస్, అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ కె.ఎం.యువరాజు, పెట్లూరు నిమ్మ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ పి.శ్యాంసుందర్ రెడ్డి, అనంతపురం, మహానంది, పులివెందుల, గుంటూరు ఉద్యాన పరిశోధన స్థానాల అధిపతులు డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ శివరామ కృష్ణ, డాక్టర్ రమణ, పెనుకొండ, వనపర్తి కృషి విజ్ఞాన కేంద్రాల అధిపతులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎం.బాలకృష్ణ, ఉద్యాన కళాశాల అధ్యాపకులు డాక్టర్ సయ్యద్ సదరున్నీషా, డాక్టర్ రౌత్, డాక్టర్ గిరిధర్, డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ ముకుంద లక్ష్మి, డాక్టర్ జి.శారద, డాక్టర్ కె.లలిత, డాక్టర్ శిరీష, డాక్టర్ దీప్తికిరణ్ పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సు ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కడప : తిరుపతి జిల్లా వెంకటగిరి పగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టల్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లమా కోర్సులో శిక్షణ కోసం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా చేనేత, జౌళిశాక సహాయ సంచాలకులు పిచ్చేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిప్లమో కోర్సులో శిక్షణ ఇచ్చి కేంద్ర ప్రభుత్వ జౌళిశాఖ ద్వారా సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. ఈ సంస్థలో దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, పాండిచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన అభ్యర్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంలో ఉన్న 11 హ్యాండ్లూమ్ ఇన్‌స్టిట్యూట్‌లో వెంకటగిరి ఒకటి అని తెలిపారు. పదవ తరగతి పాస్ అయిన అభ్యర్థులకు వారి మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారన్నారు. ఇంటర్ ఎంపిసి, ఐటిఐ ఉత్తీర్ణులైన వారు నేరుగా రెండవ సంవత్సరంలో చేరవచ్చన్నారు. ఈ కోర్సు చదివే వారందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు స్టైఫండ్ నెలకు రూ. 2500 పొందేందుకు అర్హులని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన వారికి వెంటనే క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. చేనేత, జౌళి శాఖకు సంబంధించిన ప్రభుత్వ ఉద్యోగాల కోసం వారికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఉన్నత చదువులు చదవాలనుకున్నవారు ఈ కోర్సు చేసిన తరువాత నేరుగా రెండవ సంవత్సరం బిటెక్‌లో ప్రవేశించవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు కాలేజీ వెబ్‌సైట్ www.lihtvgr.comను సంప్రదించవచ్చునని తెలిపారు. మరింత సమాచారం కోసం 9866169908, 9010243054 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 1 ఆఖరి తేదీ అన్నారు.

ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం మేరకే కూల్చివేత

ప్రజాశక్తి - కడప అర్బన్ : సిఎస్ఐ రాయలసీమ డయాసిస్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ నిర్ణయం మేరకే సిఎస్ఐ బాయ్స్ హాస్టల్ పాత గదులను కూల్చివేశామని సిఎస్ఐ రాయలసీమ డయాసిస్ వైస్ చైర్మన్ రెవరెండ్ యు. సాల్మన్, సెక్రటరీ రెవరెండ్ సి.సాల్మన్, అసిస్టెంట్ సెక్రటరీ డాక్టర్ పి.ఎస్. వినయ్ కుమార్ వెల్లడించారు. సిఎస్ఐ రాయలసీమ డయాసిస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎస్ఐ హాస్టల్ గదులలో షర్మిల అనే మహిళ హైస్కూల్ నడుపుకునేందుకు తాము ఎటువంటి లీజుకు ఇవ్వలేదని, అగ్రిమెంట్ కూడా చేసుకోలేదని తెలిపారు. తాము గతంలో న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వారికి లీజుకు ఇచ్చామని, వారి లీజు కూడా పూర్తి అయిన తరువాత ఆ గదులను తమకు అప్పగించి వెళ్లిపోయారన్నారు. ఆ క్రమంలో వారు తమకు తెలియకుండా షర్మిల అనే మహిళతో సబ్ లీజ్ ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. ఈ విషయం తమకు తెలిసి బాయ్స్ హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరుకున్నాయని, భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదం జరగకూడదనే గదులను కూల్చే ప్రయత్నం చేశామని చెప్పారు. షర్మిల అనే మహిళ కోరిక మేరకు ఒక సంవత్సరం కాలం పాటు విద్యాసంస్థలను నడుపుకునేందుకు అంగీకరించామన్నారు. మూడేళ్లవుతున్నా ఖాళీ చేయకుండా ఇబ్బందులు పెడుతుందన్నారు. శిథిలావస్థకు చేరుకున్న గదులు కూలిపోతే విద్యార్థులకు ప్రాణహాని వాటిల్లుతుందని తొలగించామని తెలిపారు. దీనిలో సిఎస్ఐ రాయలసీమ డయాసిస్ పీఠాధిపతి ఐజాక్ వరప్రసాద్, ఆయన కుమారుడు పాత్ర లేదన్నారు. వారిపై అవాస్తవాలు చిత్రీకరించి తప్పుడు కేసులు పెట్టారన్నారు. సమావేశంలో రాయలసీమ డయాసిస్, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడును దిగ్విజయం చేయండి

ప్రజాశక్తి- కమలాపురం టౌన్ : కమలాపురం నియోజకవర్గంలో నిర్వహించే మహానాడు విజయవంతం చేయాలని టిడిపి జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఖాదర్‌బాషా కోరారు. మహానాడును కమలాపురం నియోజకవర్గంలోనే జరగడానికి ముఖ్య కారణం పుత్తా నరసింహారెడ్డినని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కమలాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ తరపున హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నామని ఆయన తెలిపారు కార్యక్రమంలో సిహెచ్‌సి చైర్మన్ జంపాల నరసింహారెడ్డి పరంధామ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గుజ్జుల నారాయణ ,పెద్ద మాబు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి

ప్రజాశక్తి కడప అర్బన్

వేసవి శిబిరాలు విద్యార్థుల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం, ఆవిష్కరణ భావనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఎంఇఒ-2 ఎస్. ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం సమ్మర్ క్యాంపును శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు, మ్యాజిక్, పాటలు, సరదాతో శాస్త్రీయ విజ్ఞానం నేర్పించే కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు ఇలాంటి అనుభవాలు పిల్లలలో శాస్త్రీయ దృష్టి కోణాన్ని అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ఈ దిశగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని చెప్పారు. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభిస్తుండడంతో రాబోయే రోజుల్లో మరిన్ని విభిన్న, వినూత్న అంశాలతో ఈ సమ్మర్ క్యాంపు కొనసాగిస్తామని జెవివి జిల్లా అధ్యక్షులు సమీర్ బాష తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్ఎం. సి.ఎస్. అంజాద్ అలీ, ఎస్ఎంసి చైర్మన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అబ్దుల్ గఫూర్, కామేశ్వరమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ డిఎస్‌సి పరీక్షను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈనెల 28న డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించే మోడల్ డిఎస్‌సి పరీక్షను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పిలుపునిచ్చారు. శుక్రవారం డిఇఒ ఛాంబర్‌లో మోడల్ డిఎస్‌సి పరీక్ష కరపత్రాన్ని డిఇఒ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ డిఎస్‌సి పరీక్ష నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకులను అభినందించారు. పోరాటాలు, ఉద్యమాలు వంటి మాత్రమే కాకుండా నిరుద్యోగులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయమన్నారు. అభ్యర్థులకు ప్రభుత్వం నిర్వహించే డిఎస్‌సి నమూనా పరీక్ష సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివ కుమార్ మాట్లాడుతూ పరీక్ష కేవలం ఎస్‌జిటి అభ్యర్థులకు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రశ్న పత్రాన్ని ప్రముఖ విద్యావేత్త మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేత తయారు చేయించారని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే డిఎస్‌సి పరీక్షకు ఈ నమూనా పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. పరీక్ష జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. కడపలో వెంకట సాయి కోచింగ్ సెంటర్, యుటిఎఫ్ భవన్, ప్రొద్దుటూరు సృజన్ కోచింగ్ సెంటర్, జమ్మలమడుగు ఎస్‌వి డిగ్రీ కాలేజ్, బద్వేలు గౌతం కాలేజీ, పోరుమామిళ్ల వర్షా కోచింగ్ సెంటర్ పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశామని చెప్పారు. రూ.50 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు కడప 9912758515, 966664330, ప్రొద్దుటూరు 80080 87023, జమ్మలమడుగు 9912758515,9100995538, బద్వేలు 9059414222, 779950626227, పోరుమామిళ్ల 824723631 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, సహాయ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్ పాల్గొన్నారు.

138 జిఒను అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్, పెస్ట్ కంట్రోల్ కార్మికుల వేతనాలు పెరుగుదల కోసం ప్రభుత్వం గత సంవత్సరం ఒక కమిటీని వేసిందని, ఆ కమిటీ 13/ 11/2024, నవంబర్ 13న జిఒ నంబర్ 138ను విడుదల చేసిందని, ఆ జిఒను అమలు చేయాలని ఆప్కాస్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులు సుందరంగా, పరిశుభ్రంగా ఉన్నాయంటే వాటి ప్రధాన కారణం అక్కడ పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులే అన్నారు. గత ప్రభుత్వం రూ.16 వేల వేతనం ఇవ్వాలని చెప్పి టెండర్లలో పొందుపరిచింది, కానీ కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ వారికి నెల నెల సక్రమంగా వేతనాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో రూ.8వేలు, రూ.10వేలు అంతకన్నా ఎక్కువ ఎక్కడ ఇవ్వలేదని తెలిపారు. ఇప్పుడు ఇచ్చే టెండర్లలో కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం ఎవరైతే వేతనాలు సక్రమంగా చెల్లిస్తారో, పిఎఫ్ ఇఎస్ఐ సక్రమంగా కడుతారో వారికే టెండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శానిటేషన్ కార్మికులు నెలకు రూ.6,600 చొప్పున ఆరు నెలలకు రూ.39,600లు నష్టపోయారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కమిటీ నిర్ణయించిన ప్రకారం వేతనాలు పెంచి ఇస్తే వారు చేసుకున్న అప్పుల బాధల నుంచి కొంతవరకైనా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చొరవ చేసి టెండర్లు పిలిచి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి, నగర కమిటీ సభ్యులు కె.మహేష్, పి.పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప : ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇయన మాట్లాడారు. టిడిపి కూటమి 11 నెలల పాలనలో కడప జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన ఉక్కు కర్మాగారం ఊసే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కడప - రాయచోటి - మదనపల్లి - బెంగుళూరు నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గం పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. నేషనల్ మెడికల్ కమీషన్ పులివెందుల మెడికల్ కళాశాలకు 50 ఎంబిబిఎస్ సీట్లు మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వద్దని లేఖ రాయడం దారుణమని వాపోయారు. కాసిరెడ్డి నాయన జ్యోతిక్షేత్రంలో కట్టడాలు కూల్చి వేసింది అని తెలిపారు. తెలుగు గంగ, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. మహానాడు లోపల జిఒ 85ను రద్దు చేసి పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కమలాపురం అసెంబ్లీ సమన్వయకర్త మీగడ అశోక్ కుమార్ రెడ్డి, సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, డిసిసి ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్, డిసిసి కార్యదర్శి కర్నాటి భువన్ రెడ్డి, పిసిసి మైనార్టీ ప్రధాన కార్యదర్శి రఫీక్ ఖాన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్ళ బాబు, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, శీలం గంగయ్య అమర్ నాథ్ రెడ్డి,ఉత్తన్న, నాగరాజు, రమణ, వినయ్, పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు ప్రకటించాలి

మూతపడిన పరిశ్రమలు తెరిపించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ డిమాండ్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి మహానాడులో చిత్తశుద్ధితో జిల్లా సమగ్ర అభివృద్ధికి నిధులు ప్రకటించాలని, సీమ సిఎంగా ఉన్న బాబు, జగన్ గతంలో ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణాల పూర్తికి నిధులు ఇవ్వలేదని, సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి టిడిపిపై ఆధారపడిన కేంద్రాన్ని ఎప్పటి లోపు ఒప్పిస్తారో చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ ప్రశ్నించారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఈనెల 27 నుంచి 29 వరకు కడప కేంద్రంగా జరగబోతున్న తెలుగుదేశం పార్టీ మహానాడు సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ 'జిల్లా సమగ్ర అభివృద్ధి' పై విలేకరుల సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో మహానాడు భారీ ఎత్తున నిర్వహించనున్నారని తెలిపారు.మహానాడులో కడప జిల్లా సమగ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో నిధులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తరువాత రాయలసీమ వాసులైన చంద్రబాబు, జగన్ సిఎంగా పనిచేశారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రాజెక్టులు, పరిశ్రమల నిర్మాణాల పూర్తికి నిధులు ఇచ్చిన పరిస్థితి లేదని నిలదీశారు.సెయిల్ ఆధ్వర్యంలో కడప భారీ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి, రాష్ట్ర విభజన చట్టం 2014లో, పార్లమెంటు, రాష్ట్రపతి సాక్షిగా హామీ ఇచ్చారని, దానిని నెరవేర్చడానికి టిడిపిపై ఆధారపడి నడుస్తున్న కేంద్ర ప్రభుత్వ నరేంద్ర మోడీ ఎన్‌డిఎ మైనార్టీ ప్రభుత్వాన్ని ఎప్పటి లోపు ఒప్పించి నిర్మిస్తారో ఈ మహానాడులోనే ప్రకటించాలని కోరారు. కెసి కెనాల్ పై భాగంలో, కె.సి.కెనాల్ నీటి స్థిరీకరణ కోసం గుండ్రేవుల రిజర్వాయరును, కుందూ నదిపై జూలదరాసశి, రాజోలి శంకుస్థాపనలకే పరిమితమై నిధుల కొరతతో పూర్తి కాలేదని తెలిపారు. వెంటనే నిధులు ప్రకటించి పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం వెనుక కృష్ణ జలాలను రాయలసీమ కరువు ప్రాంతాలకు గ్రావిటీ ద్వారా తరలింపుకై 'సిద్దేశ్వరం భారీఅలుగు ఆనకట్ట' నిర్మించాలన్నారు. కడప నగర జనాభా తీవ్రంగా నానాటికి పెరుగుతోందని, నగరం పెద్ద ఎత్తున విస్తరిస్తోందని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం, మంచినీటి సరఫరా అవసరాల కోసం నిధులు కేటాయించాలని కోరారు. ట్రిపుల్ ఐటి అభివృద్ధి నిధులు కేటాయించాలని పేర్కొన్నారు. గతంలో పులివెందుల కేంద్రంగా హార్టికల్చర్ అంతర్జాతీయ ఎగుమతుల 'గ్రేడింగ్ సెంటర్' ఉండేదని దాన్ని పునరుద్ధరించాలన్నారు. చేనేత టెక్స్‌టైల్ జమ్మలమడుగు, ప్రొద్దుటూరులో నిర్మాణాలు పూర్తి కాలేదని, కొత్త మాధవరంలో సుమారు 2000 మగ్గాలు ఉన్నాయని, అక్కడ మరో చేనేత టెక్స్‌టైల్ కేంద్రం నిర్మాణం జరగాలని తెలిపారు. కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్‌లో యువతకు ఉపాధి అవకాశాలు అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో ఖయలాపడ్డ , మూతపడిన పరిశ్రమలను వందల సంఖ్యలో ఉన్నాయని వాటిని తెరిపించాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, వి.అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

'సైనిక్' ప్రవేశ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల యాజమాన్యం

ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో బాల వికాస్ విద్యా సంస్థలు కోచింగ్ తీసుకున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆ సంస్థ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, కో-ఆర్డినేటర్ ధరణి కుమార్, డైరెక్టర్ గంగయ్య అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ బాలవికాస్ విద్యాసంస్థలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. ఏ. కేదారి అశ్విత 300 మార్కులకు గాను 282 మార్కులు, జి. నాగ దీక్షిత రెడ్డి 277 మార్కులు, పి. భానుతేజారెడ్డి 266 మార్కులు, పి. వరదరాజు 266 మార్కులు, ఎం. మనస్వి 266 మార్కులు, టి. చక్ర దేవా 262 మార్కులు, ఏ. తేజోవంత్ రెడ్డి 258 మార్కులు, పి సాకేత్ రెడ్డి 254 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాలు సాధించారని వారు తెలిపారు. మొత్తం 300 మార్కులకు గాను 250 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు 8 మంది కాగా కాగా,200 మార్కులకు పైగా సాధించిన వారు 41 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - కడప : కడప నగరం శంకరాపురం చెందిన తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ జన్మదిన సందర్భంగా శుక్రవారం కడప జిల్లా పరిషత్ ఆవరణంలోని ప్రేమాలయం, పట్టణ నిరాశయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు శ్రీ సాయి యువజన సేవా సంఘం చైర్మన్ మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి వృద్ధులకు కేకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రేమా లయ నిరాశయుల వసతి గృహ నిర్వాకులు శ్రీనివాసులరెడ్డి, శ్రీ సాయి యువ జన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టిడిపికి దృఢమైన నాయకత్వం కావాలి

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రాజంపేట టిడిపికి స్థానిక దృఢమైన నాయక్వం కావాలని రాష్ట్ర కాపునాడు మాజీ డైరెక్టర్ మోదుగుల పెంచలయ్య పేర్కొన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్ట మండలం హరిత హోటల్‌లో శుక్రవారం ఒంటిమిట్ట మండల సీనియర్ టిడిపి నాయకులు మినీ మహానాడు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా మోదుగుల పెంచలయ్య స్థానిక మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ బలోపేతం కావాలంటే స్థానిక నాయకులకు నాయకత్వం అప్పగించాల్సిందే అని ఆయన డిమాండ్ చేశారు. స్థానికేతరులకు నాయకత్వం ఇవ్వడం వల్ల టిడిపి కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఒంటిమిట్ట ప్రజానీకం ఎంతో రుణపడి ఉందని రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమ్మర వెంకటనరసయ్య అన్నారు మండలంలో భూకబ్జాలు విపరీతంగా వైసిపి ప్రభుత్వంలో చోటు చేసుకున్నాయని చెప్పారు. ఒంటిమిట్ట, గంగ పేరూరు కొండమాసుపల్లి, గంగ పేరూరులో అక్రమాలు చోటు చేసుకున్నాయనిపేర్కొన్నారు. దీని అంతటి కారకులైన కడప డిఎల్‌పిఒ విజయభాస్కర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు మహానాడు కార్యక్రమానికి మండల ప్రజలంతా ఒక తాటిపై నడిచి అందరూ సమిష్టి కృషితో జయవంతం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు కార్యక్రమంలో మంటపంపల్లి ఎంపిటిసి సుంకేసుల బాషా, సీనియర్ టిడిపి నాయకులు మామిళ్ళ ఈశ్వరయ్య, పామూరు సుబ్రమణ్యం, నరసింహనాయుడు, మల్లికార్జున, మామిళ్ళ కృష్ణయ్య, మౌలాలి, కృష్ణారెడ్డి, చాంద్ బాషా, శ్రీనివాసులురెడ్డి, బి.వి.రమణ, సాలాబాద్ బుజ్జి పాల్గొన్నారు.

నూతన ఎంపిపిగా లక్ష్మీదేవి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

నూతన ఎంపిపి నల్లగొండ లక్ష్మి దేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గతంలో ఉన్న ఎంపిపి అక్కిశెట్టి లక్ష్మీదేవి అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. ఆమె స్థానంలో వైఎస్ ఎంపిపిగా ఉన్న నల్లగొండు లక్ష్మీదేవిని ఎన్నుకున్నారు. రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మెజార్టీ ఎంపిటిసిలు ఆమెను ఎన్నుకోవటంతో నల్లగొండు లక్ష్మీదేవి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న త్రివిక్రమ్‌రెడ్డి

ఆసక్తికరంగా బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని మిడుతూరు గ్రామంలో సీతాలమ్మ తల్లి తిరుణాల శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీతాలమ్మ తల్లికి పంచామృతాభిషేకం, చల్ల నైవేద్యంగా సమర్పించి, బోనాలు సమర్పించారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లచే బండలాగుడు పోటీలను టిడిపి మండల యువ నాయకులు సోమల త్రివిక్రమ్‌రెడ్డి, టిడిపి నాయకులు నెల్లూరప్ప యాదవ్ ప్రారంభించారు. మొదటి బహుమతిగా రూ.25 వేలు మొత్తాన్ని యువనేత త్రివిక్రమ్ రెడ్డి, రెండవ బహుమతి నెల్లూరప్పా యాదవ్ సాయంగా అందజేశారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



ఆకట్టుకున్న చెక్కభజన

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురంలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, చెక్కభజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు. ఎడ్లు బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో ఓల్డ్ కేటగిరికి చెందిన 8 జతల ఎడ్లు పాల్గొన్నాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు నగదు బహుమతి అందజేయనున్నారు.



వాహనపత్రాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మద్దిలేటి

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - తొండూరు

రోడ్డు భద్రతా నియమాలు తప్పక పాటించాలని ఎస్ఐ మద్దిలేని వాహనదారులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాల పత్రాలు పరిశీలించారు. లేని వారికి జరిమానా విధించారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు.

పిచ్చికుక్క దాడి, స్వీపర్‌కు గాయాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో పిచ్చికుక్క దాడిలో ప్రశాంతి అనే స్లీపర్‌కు గాయాలయ్యాయి. శుక్రవారం ఆర్‌టిసి ఆవరణలో శుభ్రం చేస్తుండగా పిచ్చికుక్క వెంబడించి దాడి చేసింది. ప్రయాణికులు గమనించి తరమడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బస్టాండ్ పరిధిలో కుక్కలు అధికంగా ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు.



దాడిలో చేతికి గాయం, గాయపడిన స్వీపర్ ప్రశాంతి

క్రైం కార్నర్

మోటార్ సైకిళ్ల దొంగలు అరెస్టు

రూ.10 లక్షలు విలువైన ఎనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు అర్బన్ పోలీసులు ఇరువురు మోటార్ సైకిళ్ల దొంగలను శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అర్బన్ సిఐ రమణారెడ్డి మాట్లాడుతూ దొంగల నుండి సుమారు రూ.10 లక్షల విలువ చేసే 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మైదుకూరు, చాగలమర్రి, రాయిచోటి, కొలిమి గుండ్ల, తాడిపత్రి వంటి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు గుర్తించామన్నారు. ఇంటి వద్ద పార్కింగ్ చేసి ఉన్న మోటర్ సైకిల్‌ను దొంగలించి అమ్మకాలు చేస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. కేసు ఛేధించడంలో ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు సిఐ నగదు రివార్డు అందించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితులతో పోలీసులు

దెబ్బతిన్న రక్షణ గోడలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రమాదాలు ఎప్పుడు ఏ రకంగా చోటు చేసుకుంటాయో చెప్పలేని పరిస్థితి. మితి మీరిన వేగం వల్ల కొన్ని ప్రమాదాలు జరుగుతాయి. అజాగ్రత్త వల్ల, అధికారుల నిర్లక్ష్యంతో మరికొన్ని చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా సామాన్యుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. మండల పరిధిలోని బెస్త కాలనీ- పత్తూరు గ్రామాల మధ్య కడపకు వెళ్లే ప్రధాన రహదారిపై ఓ వాగుకు సంబంధించి నిర్మించిన చిన్నపాటి వంతెనకు ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓవైపు రక్షణ కూడా పూర్తిగా లేకుండా పోయింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో వాహన రాకపోకలు అధికంగా ఉంటాయని, ప్రమాదాలకు గురయ్యే ఆస్కారం లేకపోలేదని పేర్కొంటున్నారు. వర్షాకాల సమయంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని రక్షణ కూడా లేకపోవడంతో వాగులో పడే ప్రమాదం ఉందని అంటున్నారు. ఎదురెదురు వాహనాలు రానున్న సమయంలో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని చెబుతున్నారు. రోడ్ల భవనాల శాఖ అధికారులు వంతెనలను ఏమాత్రం పట్టించు కోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని వంతెనకు రక్షణ గోడ నిర్మించి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.



'ఉపాధి'లో ఉపయోగపడే పనులు చేపట్టాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాధాకృష్ణవేణి

ప్రజాశక్తి - వేముల

ఉపాధి హామీ పథకంలో రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. మండల కేంద్రంలోని గొందిపల్లె గ్రామపంచాయితీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపిడిఒ పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారంగా పనులు చేయాలన్నారు. కూలీలకు నష్టం జరగకుండా హాజరు వేయాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు పూర్తి చేసి దినసరి కూలి రూ.307 పొందాలన్నారు. జాబ్ కార్డుల్లో ఒకరి పేరు మీద మరొకరు రాకూడదన్నారు. జాబ్ కార్డులో ఉన్నవారే ఉపాధి పనికి రావాలని, ఉదయం 6 నుంచి 11గంటల లోపు పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. పనుల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఇసి మధుసూదన్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డి బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ ఆసం గంగాదేవి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో వ్యర్థ పదార్థాలను ప్రజలు, వ్యాపారులు, తోపుడుబండ్ల వ్యాపారులు రోడ్లపై వేస్తున్నారని, ఇకపై అలాంటి వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కడప రోడ్డు మేధా కాలేజీ, నాగమణి హోటల్ సమీపాన రోడ్లపై వేస్తున్న వ్యర్థ పదార్థాలను తొలగించే ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధి ప్రారంభంలో వ్యాపారస్తులు, ప్రజలు వ్యర్థ పదార్థాలను వేస్తుండడం వల్ల పారిశుధ్య నిర్వహణకు, రవాణాకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. చుట్టుపక్కల ఉన్న హొటళ్లు, బేకరీలు, అరటిపండ్ల అమ్మకదారులు, మెడికల్ దుకాణాల వారు అన్ని రకాల వ్యర్థాలను వేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ప్రాంతంలో వ్యర్థ పదార్థాలు వేయడం ఇకపై నిషేధమన్నారు. ఉత్తర్వులు బేఖాతరు చేస్తూ చెత్త వేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మైదుకూరు పట్టణ సుందరీకరణలో భాగంగా పరిశుభ్రంగా ఉంచుటకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.



వ్యర్థాల తొలగింపును పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులురెడ్డి

త్వరలో వినియోగంలోకి రైతుబజార్



రైతుబజారును పరిశీలిస్తున్న సిఇఒ మాధవీలత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె రైతుబజార్‌ను త్వరలో వినియోగంలోకి తెస్తామని ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి (సిఇఒ) మాధవీలత పేర్కొన్నారు. గత పాలనలో నిర్మించి వదిలేసిన రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని జడ్పీ పాలక మండలి సమావేశంలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిరుపయోగంగా ఉన్న రైతుబజార్‌ను సిఇఒ పరిశీలించారు. రైతుబజార్ వినియోగంలోకి తీసుకొని రావడానికి ఉన్న సమస్యలను సంబంధిత మార్కెటింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో గత వైసిపి ప్రభుత్వ పాలనలో వేంపల్లెలో రూ.1.20 కోట్లతో నిర్మించారన్నారు. దళారుల వద్ద రైతులు మోసపోకుండా ఉండేందుకు రైతుబజారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వినియోగదారులకు కూడా తక్కువ ధరలకు నాణ్యమైన కూరగాయలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. రైతుబజార్‌లో ఉన్న స్టాల్స్ చాలా చక్కగా ఉన్నాయన్నారు. స్టాల్స్‌ను రైతులకు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. రైతుబజార్‌ను వినాయోగంలోకి తెచ్చేందుకు కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో 125 రైతుబజార్లున్నాయన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ బత్తల రుచిత, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాలుగు రోడ్ల నుంచి రైల్వేగేటు వరకు ఉన్న విద్యుత్ తీగలు, స్తంభాలు మరమ్మతులు కారణంగా ముద్దనూరులో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

రేషన్‌షాప్‌లో సూచిక బోర్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

రేషన్‌షాపుల వద్ద సూచిక బోర్డులు తప్పక ఏర్పాటు చేయాలని తహశీల్దార్ రమాకుమారి డీలర్లకు సూచించారు. మండల పరిధిలోని డీలర్లతో శుక్రవారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ నుంచి రేషన్‌షాపుల వద్దనే నిత్యవసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. గతంలో వాహనాల ద్వారా ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేసే పథకాన్ని ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. అందుకు అనుగుణంగా రేషన్‌షాపుల వద్ద ప్రతి నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు సమయపాలన పాటిస్తూ రేషన్ పంపిణీ చేయాలన్నారు. ధరల పట్టిక, స్టాక్ ఎప్పటికప్పుడు సరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. రేషన్‌షాపుల పర్యవేక్షణను కొంతమంది సిబ్బందికి అప్పగించారు. కార్యక్రమంలో డిటి కృష్ణారెడ్డి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, విఆర్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

హిమకుంట్ల పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రవేశాలను (అడ్మిషన్లు) ప్రారంభించామని ప్రధానోపాధ్యాయుడు రవిచంద్రారెడ్డి, పాఠశాల గౌరవాధ్యక్షులు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో చేర్పించే బాలురకు హాస్టల్ వసతి అందుబాటులో ఉందన్నారు. హిమకుంట్ల గ్రామానికి దూరంగా ఉన్న విద్యార్థులకు కూడా పాఠశాలలో చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే తమ పాఠశాలకు సుమారు 19 గ్రామాల విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. మండల కేంద్రం నుంచి కూడా కొంతమంది విద్యార్థులు రానున్నట్లు తెలిపారు. కొత్తగా ఇచ్చే ప్రవేశాలకు మొదటి ప్రాధాన్యత ప్రయివేట్ స్కూల్స్ నుంచి వచ్చే పేద విద్యార్థులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేడు చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సింహాద్రిపురం శ్రీకొత్తూరు చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం సాయంకాలం నుంచి ఆదివారం ఉదయం నాలుగు గంటలకు వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

26న మహిళలకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ పులివెందులలో మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు కో-ఆర్డినేటర్ చంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి కల్పన-జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఈనెల 26న వేంపల్లెలోని వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రైనీ టైలర్‌గా ఉపాధి పొందేందుకు 7వ తరగతి పాసై ఉండాలన్నారు. 18 నుండి 23 సంవత్సరాలు ఉన్న మహిళలు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. నెలకు రూ.9,181 జీతం, నెలవారి హాజరు బోనస్ రూ.వెయ్యి వస్తుందని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ సౌకర్యం కల్పి స్తున్నట్లు తెలిపారు. బస్సు సౌకర్యం కూడా ఉంటుందన్నారు. జనరల్ షిఫ్ట్ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు ఉంటుందని వివరించారు.

లోపిస్తున్న పారిశుధ్యం.. రోగాల భయంతో జనం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి. నెర్రవాడ, ఖాదర్ పల్లె, చాపాడు, సోమాపురం దళితవాడ, పల్లవోలు తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. దోమలు వృద్ధి చెంది రోగాలకు నిలయాలుగా మారుతున్నాయి. నెర్రవాడలో మురుగు కాలువ ఏర్పాటు చేసినప్పటికీ వర్షపు నీరు ప్రవహించే అవకాశం లేకపోవడంతో అక్కడే నీరు ఎక్కువగా నిలుస్తోంది. పాఠశాల సమీపంలో ప్రధాన రహదారిలో రెండు చోట్ల వర్షపు నీరు నిలిచి అధ్వానంగా తయారైంది. గ్రామంలో మురుగునీరు తాండవిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షపు నీరు నిలువ లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఆ ప్రదేశాలలో వర్షపు నీరు నిలవకుండా తగు ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ భవనాలు, ఇతర ప్రాంతాల్లో అవకాశం ఉన్న చోట్ల ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మట్టి తోలి గుంతలు పూడ్చాల్సిన అవసరం ఉంది. వివిధ రకాల చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్ట డం వల్ల వర్షపు నీరు నిలవకుండా, ప్రదేశాలు సుందరంగా తయారయ్యే అవకాశం ఉంటుంది.



నెర్రవాడ గ్రామంలో నిలిచిన వర్షపునీరు



లోక్ అదాలత్‌లో సమస్యలు వింటున్న విద్యుత్ అధికారులు

ప్రజా సమస్యలను తప్పక పరిష్కరిస్తాం

- విద్యుత్ శాఖ కార్య నిర్వాహక ఇంజినీర్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రజా సమస్యను తమదిగా భావించి తప్పక పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంబకపల్లి సబ్‌స్టేషన్‌లోని విద్యుత్ కార్యాలయంలో లోక్‌అదాలత్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పరిష్కారంకాని సమస్యలు తెలుసుకునేందుకే విద్యుత్ లోక్ అదాలత్ ఏర్పాటు చేశామన్నారు. రిటైర్డ్ జడ్జి ఆర్థిక సభ్యులు రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజన్‌కుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ లోక్ అదాలత్‌లో ఇద్దరు వినియోగదారులు తమ సమస్యలను తీసుకొచ్చారన్నారు. ఒక రైతు అడిషనల్ లోడ్ కోసం 2001లో దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదని తెలిపారు. మరో వ్యక్తి 2021లో విద్యుత్ బిల్లులు అధికంగా రావడం జరిగిందని లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని విన్న వించారు. ఇందుకు అధికారులు స్పందించి విద్యుత్ వియోగదారుల సమ స్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ గురుమోహన్ రెడ్డి, ఎడి నాగేంద్ర, ఎఇలు జగదీశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్ కుటుంబ సభ్యులు

వైఎస్ రాజారెడ్డికి ఘన నివాళులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందులలో వైఎస్ రాజారెడ్డి వర్ధంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి వైఎస్ విజయమ్మ, కుటుంబ సభ్యులు వైఎస్ జయమ్మ, రాజారెడ్డి సమాధుల వద్ద పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ ప్రతాపరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్ జగన్ వ్యక్తిగత కార్యదర్శి రవిశేఖర్, వైఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, వైఎస్ఆర్ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : దివంగత నేత వైఎస్ రాజారెడ్డి వర్ధంతి సందర్భంగా పులివెందుల పాత ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్ మనోహర్‌రెడ్డి, వైసిపి నాయకుల ఆధ్వర్యంలో రాజారెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైసిపి కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర నాయకులు రసూల్, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, వైసిపి సీనియర్ నాయకులు కోడి రమణ, రాష్ట్ర బూత్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, కౌన్సిలర్ రాజశేఖర్, కౌన్సిలర్ ఖాదర్‌వలి, కో -ఆప్షన్ చంద్రమౌళి, వైసిపి నాయకులు సోపాల వీర, పద్మనాభరెడ్డి, వీరారెడ్డి, సంపత్, రవి, మస్తాన్, రవి, కనక, కోళ్ల భాస్కర్, ఫైర్ రామకృష్ణ, చెన్నకేశవులు, రమేష్, పాతపాటి రాజేష్, బ్యాటరీ ప్రసాద్, బాల అశ్వర్థరెడ్డి, బిసి నాయకులు కార్తీక్, మారుతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి బాధాకరం

ఖాజీపేట : మండల పరిధిలోని పుల్లూరు పంచాయతీ మాజీ సర్పంచ్ ఇరగంరెడ్డి లక్ష్మీదేవి మృతికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి సతీమణి సుభద్రమ్మ, కెసి కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, మండల కో-ఆప్షన్ సభ్యులు మున్వర్ హుస్సేన్, వైసిపి నాయకులు లక్ష్మీదేవి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె మృతి తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

చాపాడు వైస్ ఎంపిపి సుందరమ్మ మృతి

చాపాడు : చాపాడు వైస్ ఎంపిపి నగిర్తి సుందరమ్మ (70) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె పల్లవోలు ఎంపిటిసి ఉంటున్నారు. సుందరమ్మ కుమారుడు జాన్సన్ పల్లవోలు సర్పంచ్‌గా ఉన్నారు. మరో కుమారుడు ప్రసాద్ వైసిపి ముఖ్య నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆమె మృతి పట్ల ఎంపిపి లక్ష్మమయ్య, జెడ్పిటిసి రాజి, వైసిపి మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



సుందరమ్మ (ఫైల్‌ఫొటో)

సమ్మెను విరమింపజేయాలి

కడప అర్బన్ : 26 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ కార్యాలయాల వద్ద సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం.చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెకు డివైఎఫ్ఐ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 రోజుల నుంచి సమ్మె చేస్తున్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవ కుండా వారిని కనీసం పట్టిం చుకోక పోవడం దారుణమని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్‌లో కీలకంగా వ్యవ హరి స్తున్నటువంటి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ. నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. ఆదిల్ పాల్గొన్నారు.